వంద రోజుల పాలన.. సంక్షేమం శూన్యం

- సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- నయవంచనే చంద్రబాబు తీరు
- పాలనాతీరుపై పెదవి విరుస్తున్న ప్రజలు


పెదనింద్రకొలను జెడ్పీస్కూల్లో అసంపూర్తిగా నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణం


బువ్వనపల్లిలో నిలిచిపోయిన అదనపు తరగతి నిర్మాణం


బావాయిపాలెం జెడ్పీస్కూల్లో అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణాలు

ఉంగుటూరు/నిడమర్రు: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా హామీలు నిలబెట్టుకోవడానికి అడుగు ముందుకు పడలేదు. సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల పాలనలో చేసిందేమీ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల్లో ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉంగుటూరు నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించి ఊకదంపుడుగా ఇచ్చిన హామీలకు కదలిక లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కూటమి తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో అలవికాని వాగ్దానాలను ప్రజలకు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నిధుల లేమి సాకుతో వాటిని నెరవేర్చే విషయంలో తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజం

ప్రజలను నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజం అని మరోమారు నిరూపించారు. వందరోజుల పాలనలో ఇచ్చిన హామీలలో వృద్ధులకు రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం మినహా మరేమీ చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేర్చలేదు. తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఎంతమంది పాఠశాలకు వెళితే అంతమంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు రూ.15వేలు చొప్పున తల్లికి వందనం అమలు చేస్తామని నమ్మపలికి ఇప్పటికీ దాని ఊసేలేదు. నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇప్పటికీ ఆ దిశగా కార్యాచరణ లేదు. ప్రతి మహిళకు 19 నుంచి 59 మధ్య వయస్సులో వారికి నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీకి అదీ గతీలేదు. ప్రతి రైతుకు పంట సాయం ఏడాదికి రూ.25 వేలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని తెలిపి వాటిని ఇంత వరకు అమలు చేయలేదు.

నియోజకవర్గంలో అపరిష్కృతంగా సమస్యలు

మరోమారు చంద్రబాబు మాటలు విని మోసపోయామని మహిళలు వాపోతున్నారు. పవన్ కల్యాణ్ ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించినప్పుడు తాము అధికారంలో వస్తే తారు రోడ్లు వేస్తారని చెప్పారు. ఇంతవరకు ఎక్కడా రోడ్లను అభివృద్ధి చేసిన దాఖలాల్లేవు. దాంతో ప్రజలు అధినాయకులు మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఏలూరు కాలువపై పురాతన వంతెనలు ఉన్నాయి. వాటిని నిర్మించాల్సి ఉంది. ఇరుకుగా ఉండటం వల్ల ఆ వంతెనల వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. వాటిని పాలకులు నిర్మించాల్సిన ప్రధాన అవసరంగా ఉంది. కూటమి నాయకులు ఇచ్చిన హామీలేవీ అమలు చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేయడం ప్రజలవంతు అవుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారడంతో వాటిని కూడా అభివృద్ధి చేయలేకపోవడంతో సర్వత్రా కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబుపై ప్రజలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్ సర్కారులో పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులు

నాటి జగన్ సర్కారులో ప్రభుత్వ బడులు కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసుతులు సమకూరాయి. మనబడి నాడు- నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలన సమూలంగా మార్చారు. అధికారం మారింది.. పేదల చదువుపై వివక్ష ప్రారంభమైంది. గత సర్కారులో ఫేజ్-1 కింద నాడు - నేడు పథకంలో నిడమర్రు మండలంలో 20 పాఠశాలలు అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాయి. ఫేజ్-2లో 14 పాఠశాలలు ఎంపిక చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అవసరమైన 4 పాఠశాలల్లో 12 అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఫేజ్-2లో గుర్తించి నిధులు మంజూరు చేశారు. సరిపడా నిధులు ఉన్నా. ప్రస్తుతం ఆనిర్మాణాలు అన్ని అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

అసంపూర్తిగా ఆగిన 12 అదనపు తరగతి గదుల నిర్మాణాలు

మండంలో నాలుగు స్కూళ్లలో 12 అదనపు తరగతి గదులు నిర్మాణాలు ప్రారంభించారు. నిడమర్రు మండలంలో బువ్వనపల్లి యూపీకి రెండు, నిడమర్రు జెడ్పీహెచ్ స్కూల్‌కి ఒకటి, పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్‌కి 4, బావాయిపాలెం జెడ్పీస్కూకి 5 తరగతి గదుల నిర్మాణాల కోసం, మొత్తం రూ.2.28 కోట్లు నిధులు నాటి వైఎస్సార్‌సీపీ సర్కారులోనే మంజూరయ్యాయి. ప్రస్తుతం మనబడి- మన భవిష్యత్తు బ్యాంక్ ఖాతాల్లో నిర్మాణాలకు సరిపడా నిధులు ఉన్నా పనులపై ఆంక్షలు ఉండటంతో ఆ నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అసౌకర్యాల మధ్య తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

పేరును మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో ఏది ?

మన బడి నాడు-నేడు పేరును చంద్రబాబు సర్కార్ పేరును రెండు నెలల్లో రెండుసార్లు మార్పు చేసింది. ఆ పథకాన్ని తొలుత స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ (ఎస్ఐఐ)గా అమలు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారు. దాన్ని ఇటీవల ఆ పేరు స్థానంలో మనబడి-మన భవిష్యత్ పేరుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పథకాల పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లోనూ ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు ఏదీ?

భీమడోలు: ఎన్నికల్లో పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచినీటి అందిస్తామని హామీ ఇచ్చి మూడు నెలలు గడిచినా అమలు ఊసే లేదు. దీనితో గ్రామాల్లో తాగునీటి చెరువులను ప్రక్షాళన చేసి ఫిల్టర్ బెడ్లలో పేరుకుపోయిన ఇసుకను తొలగిస్తామని చెప్పిన పాలకులు 100 రోజులు గడిచినా హామీ నెరవేరలేదు. గ్రామాల్లో మంచినీటి లేక ఉన్న చెరువు నీటినే తాగుతున్నారు. దీనితో గ్రామాల్లో అనేక మంది అనారోగ్యంబారిన పడుతున్నారు. పోలవరం కుడి కాలువ నీటిని చెరువులకు సరఫరా చేసేందుకు పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని రైతులు, ఆయకట్టు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుండుగొలను వద్ద గోదావరి కాలువపై రూ.4 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు నత్తనడకన సాగుతున్నారు. ఇప్పటికే ఏడాది దాటిందని ఇంకా ఎంత సమయం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు.

జగన్ సర్కారులో పరుగులు.. నేడు నత్తే నయం

జగన్ సర్కారులో నాడు-నేడు పనులు పరుగులు పెట్టాయి. దీంతో అనుకున్న సమయానికి అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వ మారిన తర్వాత నిధుల వినియోగంపై ఆంక్షలతో పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో నిడమర్రు మండలంలో నాడు-నేడు పథకంలో 20 స్కూళ్లు ఎంపిక చేశారు. ప్రతి పాఠశాలలో అవపరమైన మరమ్మతులతో పాటు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు వంటి 9 సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు రూ.2.51కోట్లు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. అనంతరం ఫేజ్-2లో 9 సౌకర్యాలు కల్పించేందుకు 9 స్కూళ్లు ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోఆవరణలో నిర్వహిస్తున్న 6 అంగన్‌వాడీ భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. ఈ 9 స్కూళ్లలో 8 స్కూళ్లలో ఈ ఏడాది మార్చిలోపే పెయింటింగ్ మినహా మిగిలిన పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

ప్రజలను దగా చేయడమే



2024 ఎన్నికల సమయంలో సూపర్ సిక్సు అమలు చేస్తామని ఆశ చూపి ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం ప్రజలను దగా చేయడమే. అమలుకాని హామీలు ఇచ్చి గద్దె నెక్కిన తరువాత వాటిని విస్మరించారు. ప్రజలందరి ఆశలపై చంద్రబాబు నీళ్ల చల్లారు.

– నార్పిన ఆదిలక్ష్మి, చేబ్రోలు, వార్డు సభ్యురాలు

రైతులకు అందని ప్రభుత్వ సాయం



పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.25 వేలు ప్రతి రైతుకి ఇస్తామని నమ్మ పలికిన చంద్రబాబు ఇప్పుడు దాని ఊసేలేదు. జగన్ మే నెలలోనే పెట్టుబడి సాయం అందించేవారు. సెప్టెంబరు నెల వచ్చింది. అప్పులుచేసి పెట్టుబడి పెట్టి పంట పండిస్తున్నాం. సూపర్‌సిక్సు అమలులో కూటమి ప్రభుత్వం ఫెయిలైంది.

– గుడ్ల శ్రీనివాసరావు, రైతు

పనులు ప్రారంభించాలి



మండలంలో 3 ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మిస్తున్న 12 అదనపు తరగతి గదులు నిర్మాణాలు తక్షణ ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆయా పాఠశాలల మన బడి- మన భవిష్యత్ బ్యాంక్ ఖాతాల్లో నిధులున్నట్లు హెచ్ఎంలు చెపుతున్నారు. ఆయా నిధులు పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో వినియోగించాలి.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు


భీమడోలులో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన డీఈవో ఎస్.అబ్రహాం

భీమడోలు: నవ సమాజ నిర్మాత ఉపాధ్యాయులని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం అన్నారు. భీమడోలులో శనివారం రాత్రి పుప్పాల మోహనసీతారామయ్య ఫౌండేషన్ అధినేతలు పుప్పాల శ్రీనివాస్, పుప్పాల హరీష్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో 1 ఈడుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో ఎస్.అబ్రహాం హాజరయ్యారు. అధినేతలు పుప్పాల శ్రీనివాస్, హరీష్ మాట్లాడుతూ గురువులపై ఉండే అభిమానంతో మూడు దశాబ్దాలుగా వారిని సత్కరిస్తున్నట్టు తెలిపారు. జిల్లా అవార్డు గ్రహీత కారే పరమానందం, రిటైర్డ్ టీచర్ కాటాక్షి, రిటైర్డ్ ఎంటీఎస్ టీచర్ కె.రవికుమార్, మండల ఉత్తమ ఉపాధ్యాయులు కె.ఝాన్సీ, జి.రెడ్డియ్య, ఎస్.నిర్మలకుమారి, ఎం.వందన, జ్యోతిబస్, కృష్ణారావు, ఆనంద్‌బాబు, ఏ.రాంబాబు, ఎస్.జయశ్రీ. భాగ్యలక్ష్మీ, కేఎంఎం రాజ్యం, ఎస్‌వీఎల్ శర్మను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 1 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎం.శరీన్, బాలభాస్కర్, మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.20 కోట్ల సెస్ బకాయిలు


భీమడోలు శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

భీమడోలు: జిల్లా గ్రంథాలయ సంస్థకు వివిధ శాఖల నుంచి రూ.20 కోట్ల సెస్ బకాయిలను రావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పుస్తక వర్గీకరణ చేసిన విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.20కోట్ల బకాయిలుండగా వాటిలో ఏలూరు మునిసిపాలిటి రూ.9కోట్లు, గ్రామ పంచాయతీల నుంచి రూ.9 కోట్లు, ఇతర మునిసిపాలిటీల నుంచి రూ.2 కోట్ల సెస్ బకాయిలు సంస్థకు చెల్లించాల్సి ఉందన్నారు. సకాలంలో సెస్‌ను సంస్థకు చెల్లించడం ద్వారా సంస్థ బలోపితమవుతుందన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మండే సుధాకర్‌లు ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు.

సామూహికంగా ఎలుకలను నిర్మూలించాలి


సూరప్పగూడెంలో ఎలుకల నివారణ మందు వినియోగాన్ని రైతులకు వివరిస్తున్న అధికారులు

భీమడోలు: సామూహికంగా రైతులందరూ ఎలుకల నిర్మూలన చర్య చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా అన్నారు. సూరప్పగూడెంలో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఒక్కొక్క రైతుకు 10 గ్రాముల చొప్పున బ్రోమోడయోలిన్ మిశ్రమాన్ని పొట్లాలుగా కట్టి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ కమిషనరేట్ జేడీఏ పద్మజ పర్యవేక్షించారు. డాట్ సెంటర్ ఏడీఏ లలితా సుధా, సీనియర్ సైంటిస్ట్ కె.ఫణికుమార్, భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి పాల్గొని రైతులకు సూచనలందించారు. రైతులంతా ఈ పంట నమోదును త్వరితగతిన చేయించుకోవాలని, ఈనెల 25లోగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో ప్రసూన, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన



డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

దెందులూరు: తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించే వరకు సమ్మె విరమించేది లేదని పీహెచ్‌సీల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం పోతునూరు, దెందులూరు, గోపన్నపాలెం వైద్యశాలల్లో జూనియర్ డాక్టర్లు ఏలూరు డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. సాధారణ, అత్యవసర అన్ని సేవలను బహిష్కరించామన్నారు. తమ భవిష్యత్తుకు గండి కొడితే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. వైద్యులు ప్రవీణ్, చైతన్య, పవన్, నాయక్, రాకేష్, రోజ్‌మేరీ నిరసనలో తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ఏలూరు (టూటౌన్): మంచి ఆహారంతో పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చునని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. మంచి ఆహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల్లో రక్తహీనతను తగ్గించవచ్చన్నారు. స్థానిక వెంకటాపురం-1 సెక్టార్ లంబాడీ పేటలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం అందించి ఎనీమియా రాకుండా చూడవచ్చని తెలిపారు. బాలింతలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యనారాయణమ్మ, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, ఈ సమస్యను అరికట్టేందుకు అవగాహన, విద్య అవసరమని ప్రిన్సిపాల్ కేపీ రామరాజు అన్నారు. సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక అవగాహనా కార్యక్రమం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరావు మాట్లాడుతూ విద్య, నైపుణ్యాలు బాలికలను శక్తివంతం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాము, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎ.లావణ్య, అడిషనల్ కోఆర్డినేటర్ జి.లక్ష్మీ సరస్వతి, సభ్యులు సీహెచ్ శ్రీదేవి, కె.అనురాధ, పి.పావని, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్, కమ్యూనిటీ సోషల్ వర్కర్ జి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: నగరంలోని పలువురు కుటుంబాలను వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ శనివారం పరామర్శించారు. రెల్లి సంఘం నాయకులు ధనియాల ఈశ్వర్ సతీమణి లలితాదేవి ఇటీవల మరణించారు. ఈశ్వర్ ఇంటికి వెళ్లిన ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈశ్వర్ సతీమణి ఆకస్మిక మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

- ఏలూరులోని ప్రముఖ పొగాకు వ్యాపారవేత్త తీరండి రమణరావు సతీమణి కనకరత్నం మరణించారు. రమణరావు కుటుంబాన్ని జయప్రకాష్ పరామర్శించి, తమ సంతాపాన్ని తెలిపారు. ఆ కుటుంబానికి ఎప్పుడూ తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముస్సుల జాన్‌గురునాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్, యల్లాపు మోజెస్, రావి సునీల్, ఎస్సీ నాయకులు సొంగా మధు, నేతల కిట్టు, వికాస్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి

దెందులూరు: రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి యర్రా నాగమల్లేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ, పాలనకు దిశ, దశ చూపించిన మేధావి, భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించడం రఘురామకృష్ణరాజు అహంకారానికి నిదర్శనమన్నారు. సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్, రాష్ట్ర హైకోర్టుకు ఆయనపై ఎంఆర్‌పీఎస్ తరపున నివేదిక అందిస్తామన్నారు.

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం


గోపినాథపట్నంలో వద్ద కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి విష్ణు

దెందులూరు: వ్యక్తిగత, సామూహిక, పరిశుభ్రత అమలుతోనే గ్రామాలు, వ్యక్తులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చల్లచింతలపూడి, కొవ్వలి ఉన్నత పాఠశాలతో పాటు అన్ని గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గోపినాథపట్నంలో స్వచ్ఛతా హీ సేవ

ఉంగుటూరు: గోపినాథపట్నంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గంట శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల వారు, ఆరోగ్య కార్యకర్తలు పారిశుధ్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పారిశుధ్య సిబ్బందికి కిట్లు పంపిణీ చేశారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

భీమడోలు: కొల్లేరు వరదల వల్ల వేలాది ఎకరాల్లోని ఆక్వా చెరువులు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భీమడోలులో శనివారం సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వాతావరణంలోని పెనుమార్పులు, కొల్లేరు వరదల వల్ల చేపలు, రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ఏలూరు రూరల్, కైకలూరు, మండవల్లి, పెదపాడు మండలాల్లోని ఆక్వా చెరువులకు ఎక్కువ నష్టం జరిగిందన్నారు. బాధిత రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. విద్యుత్ యూని ట్ రూ.1.50పైసలకు అందించాలని, విద్యుత్ సబ్సిడీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


సీతంపేట హెచ్‌డబ్ల్యూసీ సెంటరులో నులిపురుగులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండేందుకు వారి కడుపులోని నులిపురుగులను నివారించాలని సీతంపేట పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం జి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం సీతంపేట హెచ్‌డబ్ల్యూసీ సెంటరులో నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్, చాముండేశ్వరి, ఆశా కార్యకర్తలు మాధవి, ఆశ, రత్నకుమారి, మేల్ అసిస్టెంట్ మణికుమార్ ఉన్నారు.

దెందులూరు మండల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

దెందులూరు: దెందులూరు మండల పంచాయతీ అధికారిగా జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ వెట్రిసెల్వి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న కృపావరం రిలీవ్ అయ్యారు.

ఎలుకుల నిర్మూలన మందు పంపిణీ


నారాయణపురంలో ఎలుకల నిర్మూలన మందును పంచుతున్న బండారు నాగరాజు

ఉంగుటూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రోమోడయోలోన్ మందు మిశ్రమం తయారీ విధానాన్ని రైతులకు తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించి మందును పంచారు. నారాయణపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సర్పంచి దిడ్ల అలకానంద, ఎంపీటీసీ అరవెల్లి మహాలక్ష్మి, దానయ్య రైతులకు మందును పంపిణీ చేశారు. నాచుగుంటలో యిమ్మని గంగాధరరావు, చిట్టూరి హరిబాబు తదితరులు వ్యవసాయ అధికార్లు పాల్గొని మందును పంచారు.

యామన త్రిమూర్తులు సేవలు ఆదర్శనీయం


యామన త్రిమూర్తులు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గంగాధరరావు తదితరులు

ఉంగుటూరు: నాచుగుంట పంచాయతీ కొత్తగూడెం గ్రామ పెద్ద దివంగత యామన త్రిమూర్తులు సేవలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం కొత్తగూడెంలో యామన త్రిమూర్తులు విగ్రహాన్ని పంచాయతీ పెద్ద ఇమ్మని గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు వక్తలు త్రిమూర్తులను సేవలను కొనియాడారు. ప్రజాప్రతినిధులు ఇమ్మని గంగాధరరావు, పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్, కొరిపల్లి అప్పారావు, సుంకవల్లి రామకృష్ణ, యామన పెద్దిరాజు, యామన రామూర్తి, బొర్రా రాంబాబు గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం


గుండుగొలనులో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం సునీత, వినోద్‌కుమార్

భీమడోలు: బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరం పాటు పడాలని చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం బాలల హక్కుల అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్లతో ర్యాలీ, ప్రదర్శనలు నిర్వహించారు. బాల్య వివాహాలను అడ్డుకుంటామని విద్యార్థినులతో హెచ్ఎం గారపాటి సునీత, వినోద్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహంపై సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలన్నారు.అనంతరం గురజాడ అప్పారావు 162 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.